క్లుప్తంగా

సీనియర్ సిటిజన్ ఫోరం అభివృద్ధికి కృషి



సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులతో లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరించడంతో పాటు వారి ఫోరం అభివృద్ధికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని సచివాలయనగర్ సీనియర్ సిటిజన్ ఫోరం నూతన కమిటీ ఏర్పాటు చేసుకున్న సందర్భంగా సోమవారం కార్పొరేటర్‌ను కలిసి భవనం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసరాజు, శివాజీ, మూర్తి, ధనుంజయ కుమార్, దామోదర్‌రెడ్డి, సత్యనారాయణ, కృష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న పరమేశ్వర్

వనస్థలిపురం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రముఖులకు లలితకళా సమాఖ్య (సేవా సామాజిక సాంస్కృతిక సంస్థ, సర్ సీ.వీ.రామన్ అకాడమీ) ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో సువర్ణ కంకణ అవార్డులను అందజేశారు. ఇందులో భాగంగా ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్న వనస్థలిపురంకు చెందిన డా.అల్లాడి పరమేశ్వర్‌కు అకాడమీ ఆధ్వర్యంలో సువర్ణ కంకణ అవార్డును అందజేశారు.

కర్ర పూజ

వనస్థలిపురం: వనస్థలిపురంలో రెడ్ వాటర్ ట్యాంక్ వద్ద అభిమన్యు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గణపతి నవరాత్రులను నిర్వహిస్తారు. అలాగే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈసారి నిర్వహించనున్న 40వ గణపతి ఉత్సవాలను పురస్కరించుకుని రెడ్ వాటర్ ట్యాంక్ వద్ద మండప నిర్మాణానికి సోమవారం కర్ర పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, రాజేష్‌కుమార్, సుధీర్ కుమార్, శ్రవణ్‌కుమార్, పానుగోటి శ్రీధర్ రావు, పాండుగౌడ్, మాణిక్యం, సునీల్‌రెడ్డి, జగదీష్‌గౌడ్, శ్యాంకుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



కిట్లు, సరుకులను పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: కాలనీలలో ప్రజలు రోగాల బారిన పడకుండా పారిశుధ్య పనులు నిర్వహించే కార్మికులు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని క్రిస్టియన్ కాలనీలో పారిశుధ్య కార్మికులకు సేఫ్టీ కిట్లు, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హరిందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ సిబ్బంది రమాకాంత్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో..

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సోమవారం కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి రక్షణ పరికరాల కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం పారిశుధ్య కార్మికులు ఎంతో కృషి చేస్తారని, వారి ఆరోగ్యం కోసం రక్షణ కిట్లు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ డీఈ నీలిమ,ఎస్ఎస్ అజీముద్దీన్, జవాన్ యాదయ్య,నాయకులు ప్రేమ్‌నాథ్, మహేష్‌గౌడ్, చిత్రంజన్, శశికాంత్, నవకిషోర్, నాగేష్ పాల్గొన్నారు.



పీపీఈ కిట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

పనుల్లో నాణ్యత పాటించాలి

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. సోమవారం నాగోలు డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థ కాలనీ రోడ్డు నెంబర్ 5/1ఎలో రూ. 15 లక్షలు, సాయిసుప్రభాత్ కాలనీలో రూ.18 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హరిబాబు, వరకుమార్, లింగస్వామి, కృష్ణారెడ్డి, ప్రేమ్‌బాబు, మునేందర్ పాల్గొన్నారు.

డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలి

నాగోలు: వర్షాకాలంలో బస్సు డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని హైదరాబాద్ రీజినల్ మేనేజర్ సుధా పరిమళ అన్నారు. సోమవారం బండ్లగూడ డిపోలో శ్రావణమాసం చాలెంజ్, వర్షాకాలంలో డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుధాపరిమళ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులు డిపో అభివృద్ధి కోసం కృషి చేయాలని ఉద్యోగస్తులు అందరూ తమకు ఇచ్చిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. సమయపాలన పాటిస్తూ ప్రయాణికులను తమ తమ గమ్యస్థానాలకు చేర్చాలన్నారు.అనంతరం ఉద్యోగులతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటేశం పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరుగుతోందని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని లక్ష్మీనారాయణ కాలనీలో రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును సోమవారం ఆయన కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని కాలనీలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే ముంపు సమస్య పరిష్కారానికి నాలాలు, రోడ్లు, నూతన డ్రైనేజీ నిర్మించడం జరిగిందన్నారు. కాలనీల్లో పచ్చదనం పెంపొందించడానికి త్వరలో మొక్కలను నాటే కార్యక్రమం చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాసిబాయ్, లలిత్‌బాయ్, కాంతిబాయ్, ప్రవీన్, అంబలాల్ పటేల్, నాయకులు పలుసం శ్రీధర్‌గౌడ్, రాజేశ్వరీ, వసంత, వాసు, జైపాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రోహిత్, విష్ణు, వెంకట్, జ్యోతి రెడ్డి, కళ తదితరులు పాల్గొన్నారు.

వరద కాలువలోకి మురుగు కలపొద్దు

మన్సూరాబాద్: వరద కాలువలోకి డ్రైనేజీ మురుగును కలిపితే చర్యలు తీసుకుంటామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హెచ్చరించారు. సెవెన్‌హిల్స్‌కాలనీవాసులు ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ ఆయన నాలా ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. జడ్జెస్‌కాలనీ, సహారాస్టేట్స్‌కాలనీ, హిమపురికాలనీల గుండా వర్షపునీరు పారేందుకు బాక్స్‌టైప్ నాలాను నిర్మించడం జరిగిందని, కొందరు గుట్టుచప్పుడు కాకుండా వరదకాలువలోని సివరేజీ కనెక్షన్‌ను కలిపారని, దీంతో దుర్వాసన వస్తుందన్నారు. ఆటోనగర్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తా చెదారం వెంటనే తొలగించాలని శానిటేషన్ సిబ్బందిని కోరారు. ఆటోనగర్ రోడ్డుపై చెత్త డంపింగ్ చేస్తున్న వారిపై చర్యలు చేపడుతామన్నారు.ఈ కార్యక్రమంలో సయ్యద్‌జానీ, కత్తుల రాంబాబు, శోభన్‌బాబు, మధుసూధన్‌రెడ్డి, కిరణ్, అజయ్, చంద్రశేఖర్, కిషోర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి



అధికారులతో చర్చిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

హయత్‌నగర్: వనస్థలిపురం నుంచి హయత్ నగర్, లక్ష్మారెడ్డి పాలెం వరకు ఉన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. సోమవారం ఆయన హయత్‌నగర్ పాత మండల పరిషత్ కార్యాలయంలో ట్రాఫిక్, పోలీసు, నేషనల్ హైవే అధికారులు, విగ్రహాల నిర్వాహకులు, స్థానిక నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్డు విస్తరణ కోసం అడ్డుగా వస్తున్న విగ్రహాలను మరో చోటికి తరలించేందుకు విగ్రహాల నిర్వాహకులు సానుకూలంగా ఉన్నారని, రోడ్డును దాటేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి నేషనల్ హైవే అధికారులు ముందుకు వచ్చారన్నారు. డబుల్ డెక్కర్ రోడ్డు నిర్మాణంలో భాగంగా జరిగే తాత్కాలిక ఇబ్బందులను వాహనదారులు అర్థం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీవాణి, పోలీసు సీఐ నాగరాజు, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి నాయకులు గజ్జి బాస్కర్, చెన్నగోని రవి, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ర రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే ఊరుకోం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: ప్రభుత్వ స్థలాలు కబ్జాచేస్తే ఊరుకోబోమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. రామాలయం నిర్మించే దగ్గర కాలనీ లేవుట్ ప్రకారం దారి ఇవ్వాలని కాలనీవాసులు కోరగా ఇరువర్గాల నడుమ వివాదం చోటు చేసుకోవడంతో ఈ విషయం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన హయత్‌నగర్ సర్కిల్ అధికారులతో కలిసి సోమవారం రాయాలయ పనులను పరిశీలించారు.బండ్లగూడ ప్రాంతంలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని స్థానికులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఇతర జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ, టౌన్ ప్లానింగ్ అధికారి విజయలక్ష్మి, నాగోలు డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, నాయకులు రాజిరెడ్డి, చెరుకు ప్రశాంత్ గౌడ్, జగదీశ్వర్, శంకరయ్య, యాదయ్య, సుదర్శన్, రాములు గౌడ్, రాజు గౌడ్, భవాని శంకర్‌గౌడ్, లక్ష్మయ్య గౌడ్, పాండు గౌడ్, శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

సింధూర్ ఎన్‌క్లేవ్‌గా నామకరణం



మన్సూరాబాద్: ఎల్‌బీనగర్‌లోని ఎల్‌పీటీ మార్కెట్ వెనుకవైపు ఉన్న హైరెంజ్ అపార్ట్‌మెంట్స్ నివాసితులు కాలనీని సింధూర్ ఎన్‌క్లేవ్‌గా నామకరణం చేయగా సోమవారం మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దేశ భక్తిని చాటే విధంగా కాలనీకి సింధూర్ ఎన్‌క్లేవ్‌గా నామకరణం చేసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం కాలనీవాసులు పలు సమస్యలపై కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతరాములు, విజయసారథి, ఉమామహేశ్వర్‌రెడ్డి, నరేందర్‌రావు, చంద్రశేఖర్, సతీష్‌రెడ్డి, నాగార్జున పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణ దిశగా అడుగేయాలి



చైర్మన్ మధుసూదన్‌రెడ్డి సన్మానిస్తున్న విద్యార్థులు

మలక్‌పేట: విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణ దిశగా అడుగేయాలని దిల్‌సుఖ్‌నగర్ మేఘన డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ ఎం. మధుసూదన్‌రెడ్డి అన్నారు. స్థానిక కాలేజీలో ఎమ్మెస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఫేర్‌వెల్‌డే కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. జీవితంలో ఎదురయ్యే ఒడిదొడుకులను తట్టుకుని లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ రోజుల్లో చదువుతో పాటు సామాజిక పరమైన అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజని, అధ్యాపకులు మసరత్ సుల్తానా, ప్రజ్ఞ, కనకదుర్గ, స్నేహ, సౌమ్య, మోహనాస్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



సత్యనారాయణ

మలక్‌పేట: ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మూసాంబాగ్ డివిజన్ సలీంనగర్ బాలదానమ్మబస్తీకి చెందిన వి. సత్యనారాయణ (50) గత నెల 29న ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. తెలిసిన వారు బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో సోమవారం భార్య నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

చైతన్యపురి: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వారం రోజుల క్రితం గణేష్‌పురి కాలనీలో గుర్తుతెలియని వ్యక్తి సంచరిస్తున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సదరు వ్యక్తిని అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలోని ఆలేటి ఆశ్రమంలో చేర్పించారు. సోమవారం సాయంత్రం ఆ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడని ఆశ్రమ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న రఘువీర్‌రెడ్డి

మన్సూరాబాద్: భీమా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసీమియా బాధితుల కోసం మన్సూరాబాద్ డివిజన్ పరిధి సెంట్రల్‌బ్యాంక్‌కాలనీలో సోమవారం ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. సుమారు 50 మందికి పైగా యువకులు రక్తదానంచేశారు. ఈ కార్యక్రమంలో సతీష్, రవి, వెంకన్న, అఖిల్‌యాద్, సాయిగౌడ్, త్రిలోక్‌గౌడ్, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



విద్యార్థులకు టై, బెల్ట్, ఐడెంటీ కార్డులు అందజేస్తున్న రామారావు

నాగోలు: దాతలు ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించడం శుభ పరిణామని ఉప్పల మండల విద్యాధికారి రామారావు అన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని జైపురి కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు టై బెల్ట్ ఐడెంటి కార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించేందుకు ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులకు కృషి చేయడం అభినందనీయమన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు అనంత రెడ్డి స్నేహితులు నిరంజన్ రెడ్డి వారి అమ్మ నారాయణమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు టై బెల్ట్ ఐడెంటి కార్డులు అందించారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు దాతల సహకారంతో గత మూడేళ్లుగా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతరెడ్డి, మేరీ బ్యూల,గాయత్రి, రాజేశ్వరి, రమాదేవి పాల్గొన్నారు.


ఘనంగా పలహార బండి ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం లోని మైసమ్మ అమ్మవారి పలహార బండి ఊరేగింపు ఉత్సవ కమిటీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, ప్రధాన కార్యదర్శి బండి మధుసూదన్ రావ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, ఆర్‌కేపురం మాజీ కార్పొరేటర్ దేప సురేఖా భాస్కర్ రెడ్డి, శ్రీరామ కృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పున్న నిర్మల హాజరై పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేప భాస్కర్‌రెడ్డి, పున్న గణేష్ నేత మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయలకు నిలిచే బోనాల పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. కొత్తపేట ప్రాంతంలో శ్రావణమాసంలో ప్రారంభమయ్యే పండుగలో భాగంగా పలహార బండి, అమ్మవారి ప్రతిరూపం తొట్టెల, పోతరాజుల నృత్యాలతో భాజా భజంత్రీలతో జోగిని అనురాధ నేతృత్వంలో శివశక్తుల పూనకాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిలక ఉపేందర్ రెడ్డి, గట్ల రవీంద్ర, సురేష్ కుమార్, రఘుపతి రెడ్డి, వెంకటేశ్వర్లు, నవరాజ్, జెల్లా జగన్నాథం పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి



ముత్తినేని వీరయ్య

చాదర్‌ఘాట్: దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కన్నా సంవత్సర కాలంలో వికలాంగుల సమగ్ర అభివృద్ధికి పాటు పడ్డామన్నారు. వికలాంగులకు ఉన్నత విద్య, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, కోర్టు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించామన్నారు. వికలాంగుల కార్పొరేషన్‌లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీలు అందేలా చట్టం చేశామన్నారు. స్పోర్ట్స్ పాలసీ ద్వారా వికలాంగులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు.

పేరుకుపోతున్న చెత్త

లింగోజిగూడ: వివిధ కాలనీలు, బస్తీల్లోని రోడ్లపై భారీగా చెత్త పేరుకుపోతుండంతో దుర్వాసన వస్తోందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేల మంది ప్రయాణించే ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద గత కొన్ని రోజులుగా చెత్త పేరుకుపోవడంతో అటుగా రాకపోకలు సాగించే క్రమంలో ఘాటైన వాసన వస్తోందని బాటసారులు వాపోతున్నారు. ఎప్పటికప్పుడు తరలించాల్సిన చెత్తను నాలుగైదు రోజులుగా వదిలేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఉన్నతాధికారులు స్పందించి పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని కాలనీ, బస్తీవాసులు కోరుతున్నారు.



ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద పేరుకుపోయిన చెత్త

పార్టీలకు అతీతంగా అభివృద్ధి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్: పార్టీలకు అతీతంగా మలక్‌పేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. సోమవారం ఆయన సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులు, సిబ్బందితో కలిసి డివిజన్ పరిధిలోని కరణ్‌బాగ్ కాలనీలో పర్యటించారు. కాలనీలోని పలుచోట్ల మొక్కలు నాటారు. కాలనీలో పలు అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీటి విషయమై తాము ఎదుర్కొంటున్న సమస్యలను కాలనీవాసులు వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కరణ్‌బాగ్ కాలనీవాసులు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట సర్కిల్ డీసీ అలీ, ఏఈ వెంకన్న, వాటర్‌వర్క్స్ డీజీఎం హస్మత్‌అలీ, మేనేజర్ శ్రవణ్‌కుమార్, మనోహర్, శ్రీనివాస్, హార్టీకల్చర్ మేనేజర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పార్కు నిర్వహణపై ప్రశంస



పల్లె నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న జెడ్సీ

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్ ఉషోదయ కాలనీలోని జీహెచ్‌ఎంసీ పార్కును పరిశీలించిన ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ సోమవారం కాలనీ అధ్యక్షుడిని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీకి పార్కు కావాలి అనే వారు నిర్వహణ బాధ్యతను కూడా తీసుకోవాలని, పార్కు ఏర్పాటు చేయడం ఒక ఎత్తయితే దానిని పరిశుభ్రంగా ఉంచడం మరో ఎత్తని తెలిపారు. పార్కు పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్న కాలనీ అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ, హార్టికల్చర్ అధికారి అన్నపూర్ణ పాల్గొన్నారు.

రాజ్‌భవన్‌లో 18న ఉచిత వైద్య శిబిరం

చాదర్‌ఘాట్: ఈ నెల 18న రాజ్‌భవన్‌లో సంస్కృతి హాల్లో జరిగే వికలాంగుల ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లగొండ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో వికలాంగులకు మాత్రమే ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడుతుందన్నారు. రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి హాజరవుతారన్నారు.